# గురు శిష్యులు

రామచంద్రపురం టౌన్ హాలు—

అందులో ఆంధ్ర విజ్ఞాన పరిషత్తు—

దానికి కార్యదర్శి డాక్టరు కనకరాజుగారు— ఏటేటా వార్షికోత్సవాలు జరుపుతూండడం ఎవరేనా ఆగంతుకంగా వస్తే సాహిత్యోపన్యాసాలు చేయిస్తూండడం ఆయన రివాజు.

టవున్ హాలు ఊరికి కొంచెం దూరం.

సాహిత్యసభలకు 'దారులుకాసి డప్పులు బజాయించినా' పాతిక

మంది అయినా రాకపోవడం నాటికీ నేటికీ తెలుగుదేశాన్ని విడిచిపెట్టని పరమసత్యం! దానికి రకరకాల ఆకర్షణలుపెట్టి డాక్టరుగారు జనాన్ని 'తోలెడి' వారు. 'తోలేటి' అనే ఇంటిపేరిని అలా సార్థకం చేసుకుంటూ సభలు జరపడంలో ఆయన మహా ఘటికుడు.

జనాన్ని ఆకర్షించడానికి సభకు ముందుగా టీ పార్టీ పెడితే బాగుంటుందని ఒకనాడు తోచింది డాక్టరుగారికి. జనం బాగా వచ్చారు. పార్టీ బ్రహ్మాండంగా జరిగింది. ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన పురప్రముఖులు టీ తాగిన వెంటనే వెళ్ళిపోయారు. ఉపన్యాసకునితో సహా మేం అయిదుగురం- పరచిన నాలుగు తివాచీలు మిగిలాం.

ఇంకోసారి టెక్నిక్ మార్చి డాక్టరుగారు, పార్టీ సభానంతరం అన్నారు. పురజనం తెలివి తక్కువ వారా ? – అన్ని పనులు చూసుకుని సభ ముగిసి పార్టీజరిగే వేళకు దయచేశారు.

వార్షికసభ మళ్ళా వచ్చింది-

గొప్ప ఆకర్షణలు పెట్టాలి. ఎట్లా ?

డాక్టరుగారు సర్వస్వతంత్రులు.

ఎవరితోనూ ఏమీచెప్పలేదు.

హఠాత్తుగా– ఆవేళ మిత్రమండలిలో ప్రకటించారు.

ఏమని ?

'కింకవీంద్ర ఘటా పంచానన, శతావధాని శ్రీమత్ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిలవారు ఈరోజు మన సభకు అధ్యక్షత వహిస్తున్నారు" అని- మా టంగులు తెగాయి.

తెల్లబోయాం.

నేను అంతక్రితమే వారి కోరికమీద విశ్వనాథ సత్యనారాయణ గారిని ఆహ్వానించాను. ఆయన అంగీకరించారు.

భావకవిత్వానికి అప్ప కవిత్వానికి 'షష్ఠాష్టకం' రోజులవి -

భావకవులెవరు ? అంటే—

'అప్పకవి భర్తలు' అని బోరవిరుచుకు తిరిగే సమయం అది -

కనకరాజుగారి మిత్రులు బంగారయ్యగారు నవకవులను చిరుకవులని పేరుపెట్టి ఎగతాళి చేసేవారు.

ఆ బంగారం వాసన ఈ కనకం దగ్గర కూడా లేకపోలేదు. దానికి జవాబుగా మేం పూర్వకవులను 'బృహత్కవులు' అని సాభిప్రాయంగా అనడమూ కద్దు.

చెళ్ళపిళ్ళవారూ విశ్వనాథవారూ కలిస్తే ఎలా ఉంటుందో తమాషా చూడా లనిపించి ఉండాలి, డాక్టరుగారికి—

వెంకటశాస్త్రిగారి పీఠం సపరివారంగా కనకరాజు గారింట్లో దిగింది. మూటాముల్లె, ఆయన కుమారుడు దుర్గయ్యా, ఇత్యాదయః

విశ్వనాథవారు సరాసరీ మా యింటికి వచ్చారు. ఉభయ ప్రదేశా ల్లోను, ఎవరికి తగ్గ అతిధ్య ప్రయత్నాలు అక్కడ జరుగుతున్నాయి.

అ ఊళ్లో కొత్తగా ప్రాక్టీసు పెడదామని డాక్టర్ చెన్నాప్రగడ సుబ్బారావుగారు వచ్చి బ్రాడీపేటలో ఉన్నారు. అయన విశ్వనాథ, బాపిరాజు

ప్రభృతులకు అనుంగు మిత్రుడు. నవకవులమీద ఎక్కడలేని మోజూను. సత్యనారాయణగారు ఊళ్ళోకి వచ్చారని తెలిసి వారితోపాటు నన్నూ భోజనానికి పిలిచారు. వెంకటశాస్త్రుల వారిని కూడా దేవతార్చనకు ఆహ్వానించారు.

సుబ్బారావుగారు తమ ఇంట వీధిగదిలో హాయిగా మిత్రులు కబుర్లు చెప్పుకునే ఏర్పాటు చేశారు.

సత్యనారాయణగారు మంచి 'మూడ్'లో ఉండి కబుర్లు చెబుతూ పద్యాలు చదువుతూ సిగరెట్ వెలిగించారు. ధూమవర్తిక సెగల పొగలతో పాటు పద్యాలూ వెలుగుతున్నాయి.

తలుపు తోసుకుని చిన్నవాడు దుర్గయ్య హఠాత్తుగా లోపలికి ప్రవేశించాడు. సత్యనారాయణగారు ఆశ్చర్యపడుతూ, సిగరెట్ కొంచెంపక్కగా పట్టుకుని -

"ఏంరా, ఇలా వచ్చావు" అన్నారు.

"నేనే కాదు, నాన్నగారూ వస్తున్నారు. ఇక్కడ మాకు భోజనం" అన్నాడు కుర్రాడు.

సుబ్బారావుగారికి విశ్వనాథమీద ఇష్టం. చెళ్ళపిళ్ళవారిమీద గౌరవం. ఇద్దరినీ విందుకు పిలిచారు. విశ్వనాథకు, గురువుగారు కూడా ఇక్కడికే వస్తున్నారని చెప్పడం మరిచిపోయారు, పనితొందర్లో-

"దుర్గయ్యా, మంచివాడవు. ఈ పొగ సంగతి నాన్నగారితో చెప్పకేం" అన్నారు సత్యనారాయణగారు నవ్వుతూ - ఆ నవ్వులో తెలుపు కంటే నలుపే ఎక్కువగా ఉంది.

సాయంకాలం టౌన్‌హాల్లో సభ.

జనం బాగా వచ్చారు.

"చెళ్ళపిళ్ళవారిని విశ్వనాథవారిని ఒక్కచోట చూస్తే యెలా ఉంటుందో-" ఈ చమత్కారం బాగా పని చేసింది, జనంలో —

ఉభయులూ వేదికమీద సమాసీను లయ్యారు. లాంఛనాలయాయి.

చెళ్ళపిళ్ళవారు సావధానంగా పొడుంకాయ తీసి ఒక పట్టు 'ధ్వని' ప్రధానంగా పీల్చి -

ఎక్కడ మొదలెట్టారో- ఎక్కడ సంచారం చేశారో- ఎలా ముగించారో ఎవరికీ తెలియలేదు. ఆ ప్రవాహంలో కొట్టుకుపోయి-తేరుకుని జనం చప్పట్లు వర్షించి బైటపడ్డారు.

విశ్వనాథవారు తర్వాత ఉపన్యాసానికి సద్దుకుంటున్నారు :

యింతలో టేబుల్‌మీద పెట్టిన మంచినీళ్ళ గ్లాసు తిరగబడి, బల్ల మీదున్న రంగుల గుడ్డ మీదుగా నీళ్ళు కారుతున్నాయి.

వెంకటశాస్త్రిలుగారు అతి కొంటె-

'ఒలికింది ఒలికింది ఒగల కిన్నెరసాని -

కులికింది కులికింది కోరి కిన్నెరసాని -

తడిసింది తడిసింది పొడిది మేజాగుడ్డ -

అని అతి 'సీరియస్'గా మొహంపెట్టి పాడడం ప్రారంభించారు.

కొత్త కవిత్వంమీద వెటకారమేగాని, సత్యనారాయణగారిమీద ప్రేమ లేకపోవడం కాదు.

సభ అంతా ఒకటే గొల్లున గోల! పావుగంటసేపు - వాన వెలిసింది-

సత్యనారాయణగారు ఇంకొకరినైతే నమిలి మింగేసేవారు-

కాని- ఇక్కడ గురువుగారు!

నవ్వుతూ మొదలెట్టారు.

ఆ నవ్వు ఎర్రగా ఉంది -

'గురువుగారికి కిన్నెరసానిమీద ఇంత అభిమానమని నాకు తెలియదు. ఎంత బాగా జ్ఞాపకం ఉంచుకున్నారు! చిత్రమేమిటంటే -

ఒక పరగణాకు చెందిన పెద్ద రౌడీదగ్గర - ఆ పరగణా శిష్యులు మాట్లాడరు.

అది ఆ గురు శిష్యుల మర్యాద-

"ఇక నా ప్రసంగం వినండి."

అని అద్భుతంగా నవ్యకవిత్వం గురించి ప్రసంగించి ఆంధ్రప్రశస్తిలోవో కొండవీటి పొగమబ్బుల్లోవో పద్యాలు అమోఘంగా చదివారు.

సభ నిశ్శబ్ద మయింది.

సభ్యులు గురువుకు తగ్గ శిష్యుడని ఆనంద తరంగితులయ్యారు.